కేవలం
తల్లిగా, భార్యగా
బ్రతికిన ఆమెకు
దొరికిన ప్రతిఫలం?

చిన్నకోట
సుశీలాదేవి
కథ

# ఎడారి కోయిల

రాత్రి తొమ్మిది గంటల సమయం!

రాజారావు టి.వి ముందు కూర్చుని నాటకం చూస్తున్నాడు. మాలతి మంచినీళ్ల చెంబుతో గదిలోకొచ్చి మరచెంబు భర్త మంచం దగ్గరపెట్టి వెనుదిరగబోయింది.

“మాలతీ..” రాజారావు పిలిచాడు.

మాలతి ఆగి ‘ఏమిటన్నట్లు చూసింది?’

“మాలతీ నువ్వు రేపట్నించీ ఆఫీసుకు వెళ్లనక్కర్లేదు”

“ఏం”

“ఇదుగో నీ రిజిగ్నేషన్ లెటర్! నేనే రాసాను. దీనిమీద నువ్వు సంతకం పెడ్తే తీసుకెళ్ళి ఆఫీసులో ఇస్తాను” టి.వి తెరమీద నుండి దృష్టి మరల్చకుండానే చెప్పాడు.


ఆ మాటలకు మాలతి నిశ్చేష్టురాలవ లేదు. ఆశ్చర్యపోలేదు. చిన్నగా నిట్టూర్చింది !.

ఏదో ఒకరోజు భర్త ఇటువంటి నిర్ణయానికి వస్తాడని అనుకుంటూనే ఉంది!

ఈ మధ్య భర్త ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది.

చీటికి మాటికి విసుక్కోవడం ‘మాలతీ ! బయట నువ్వు ఆఫీసరువే కాని ఇంట్లో నా భార్యవి. నేను భర్తని అది గుర్తుంచుకో” అంటూ తరుచూ జ్ఞాపకం చెయ్యడం అన్నీ గమనిస్తూనే ఉంది!

ఎప్పుడో ఒకప్పుడు ఇటువంటి బాంబు పేలుస్తాడని అనుకుంటోంది కాని ఇంత త్వరలో మాత్రం ఇటువంటి నిర్ణయానికొస్తాడని అనుకోలేదు. అందుకే ఈ విషయం మీద తనెటువంటి ఆలోచనా చెయ్యలేదు!.



''ఏం మాట్లాడవే'' అన్నాడు.

భార్య తనతో వాదిస్తే— ఆమెకేం సమాధానం చెప్పాలో అన్నీ ముందుగానే సిద్ధంచేసుకున్నాడు!

కాని మాలతి అతనికేం సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది!.

భార్య అలా మాట్లాడకుండా వెళ్ళిపోవడం రాజారావుకు ఆశాభంగం కలిగించింది! ఆ

వెంటనే కోపం కూడా వచ్చింది!

"తనే కదా ఆఫీసరు ఉద్యోగం చేస్తున్నానని అహంకారం" పళ్ళు కొరుక్కున్నాడు!.

మాలతి సరాసరి బెడ్ రూమ్‌లో కొచ్చి పిల్లల మధ్య పడుకుని కళ్ళు మూసుకుంది. రెండు వెచ్చటి కన్నీటిబొట్లు చెంపల మీదికి జారాయి!.

* * *

పదేళ్ళ క్రితం

ఇలాటి రాత్రి సమయంలోనే మాలతి ముందు కొన్ని కాగితాలు పడేసి "మాలతి.. ఈ కాగితాలపై సంతకం పెట్టు" అన్నాడు రాజారావు వాటివేపుతెల్లబోయి చూస్తూ...

"ఏమిటివి?" అనడిగింది.

"నీకుద్యోగానికి అప్లికేషన్"

బిత్తరపోయింది.

"నాకు ఉద్యోగమా?"

మొదటికాన్పు! డెలివరీ అయి మూడు నెలలయింది! పాపతో వారం క్రితమే పుట్టింటినుంచొచ్చింది!

"ఏమిటండీ! మీకేమన్నా మతిపోయిందా! డెలివరీ అయి మూడు నెలలయింది! ఇప్పుడు ఉద్యోగమా?"

"ఉద్యోగం చేసే ఆడవాళ్ళందరూ మూడు నెలలే మెటర్నటీ లీవు తీసుకుంటారు. మూడు నెలలూకాగానే చచ్చినట్లు ఉద్యోగంలో చేరాల్సిందే..తెలుసా.."

"ఇప్పుడు నేను ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముందండీ" బ్రతిమాలుతున్న ధోరణితో అంది!

ఆమాటతో రాజారావు ఇంతెత్తున లేచాడు!

"ఇంట్లో కూర్చునేదానివి నీకేం తెలుస్తుంది. ఇన్నాళ్ళూ మనం ఇద్దరమే! ఇప్పుడు మరో మెంబరు వచ్చింది అందులోనూ ఆడపిల్ల ఎన్ని ఖర్చులు! ఇప్పట్నించే డబ్బు దాచకపోతే ఎలా! అనుకోకుండా మా ఆఫీసులో క్లర్కు పోస్టుకి ఖాళీ వచ్చింది! ఈ అవకాశం వదులు కుంటే మళ్లా రాదు! వూ... త్వరగా సంతకంపెట్టు... నాకు నిద్రవస్తోంది. తొందర పెట్టాడు.

మాలతి మెదడంతా మొద్దుబారిపోయినట్లయింది. భర్త తన చేత ఉద్యోగం చేయిస్తాడని కలలో కూడా అనుకోలేదు! అందునా మూడు నెలల పసిపల్లితో... ఉద్యోగమా! డెలివరీ అయ్యాక తనకు బాగా జబ్బు చేసింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది! ఈ స్థితిలో తను ఆఫీసుపని—ఇంటిపని చేసుకోగలదా!

ఈయన అదేమీ ఆలోచించడం లేదు! ఇప్పుడే ఉద్యోగం లేకపోతే ఏమయింది! ఇన్నాళ్ళూ గడవ లేదా! అంతగా అయితే పాపకోసం తను ఇంకొంచెం పొదుపు చేస్తుంది.

తనకే ఉద్యోగం వద్దు.

పాపని చూసుకుంటూ ఇంటిపట్టున ఉండటమే ఇష్టం తనకు. అనుకుంది మాలతి!

కాని ఆమె ఇష్టాయిష్టాలను పట్టించుకోకుండా రాజారావు బలవంతంగా ఆమెచేత అప్లికేషన్‌పై సంతకం పెట్టించాడు!

తర్వాత ఇంటర్వ్యూ వచ్చింది.

మాలతి వెళ్ళక తప్పింది కాదు! పాపని పని పిల్లకి అప్పచెప్పి ఇంటర్వ్యూకు వెళ్ళింది. భర్త మీద కోపంకొద్దీ ఇంటర్వ్యూలో వాళ్ళడిగిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పలేదు!

ఇంటికి రాగానే కూతుర్ని దగ్గరకు తీసుకుంది!

"ఈ రెండు గంటలే దీన్ని వదిలి ఉండలేక పోయాను. ఇక రోజల్లా ఎలా ఉండగలను" అనుకుంది పాపను ముద్దుపెట్టుకుంటూ.

ఇంటర్వ్యూ బాగా చెయ్యలేదు. ఉద్యోగం రాదులే అనుకుంది ధీమాగా!

కానీ రాజారావు ఏం ట్రిక్కు చేసాడో కాని— మాలతికి ఉద్యోగం వచ్చింది!

అపాయింట్ మెంట్ ఆర్డరు పుచ్చుకొని రాజారావు హుషారుగా ఇంటికొచ్చాడు!

భర్త చెప్పిన వార్త మాలతికి పిడుగుపాటులా తోచింది!

"నేనీ ఉద్యోగం చెయ్యలేను" అంది దుఃఖాన్ని ఆపుకుంటూ.

ఎందుకని?

'పాపని వదిలి ఉండలేను'

"మొదట్లో అలాగే ఉంటుంది. తర్వాత అలవాటయిపోతుందిలే.."

"పాపని ఎవరు చూస్తారు? చివరి అస్త్రం వదిలింది.

"మా అమ్మని పిలిపిస్తా" అన్నాడు రాజారావు


మాలతి ఉలిక్కి పడింది!

అత్తగారా!... ఆవిడ సూర్యకాంతంలాంటిది... కోడలు తన చెప్పుచేతల్లో భయభక్తులతో ఉండాలంటే ఎప్పుడూ దేనికోదానికి సాధిస్తూ ఉండాలనే సిద్ధాంతం ఆమెది. ఆడపిల్ల పుట్టిందని డెలివరీ అయ్యాక తనని చూడటానికి రాలేదు! ఆవిడ తన కూతుర్నెలా చూస్తుందో... తెలుస్తూనే ఉంది.

వస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటూ—

"ఆవిడేం చూస్తుందండీ" అంది!

"నీ కంటే బాగానే చూస్తుంది. ఇక



అట్టే విసిగించకు. ఎల్లుండి నుండి నువ్వు ఉద్యోగానికెదుతున్నావ్... అంతే... ఆజ్ఞాపించి వెళ్ళిపోయాడు!

మాలతికి దుఃఖం ఆగలేదు!

పాపాని గుండెలకి హత్తుకుని భోరుమంది!

'తల్లీ! వీళ్ళు రాక్షసులమ్మా! వీళ్ళ మధ్య ఇక ముందు నువ్వెలా బ్రతుకుతావో... అనుకుంది బాధగా!

* * *

మాలతి ఉద్యోగంలో చేరింది!

అత్తగారు ఊరు నుండి వచ్చింది!

కసాయివాడికి మేకపిల్లని ఇచ్చినట్లు అత్తగారికి పాపను అప్పచెప్పింది. గుండెలు పిండుతున్న బాధని కడుపులో దాచుకుని— సంసారం కోసం మధురమైన మాతృప్రేమని త్యాగం చేసింది!

ఉదయం తొమ్మిది గంటలకు ఇంటి నుండి బయలుదేరితే తిరిగి ఇంటికొచ్చేసరికి రాత్రి ఏడయ్యేది!

ఈ మధ్య కాలంలో ఇంటిపని..

పాపని ప్రేమగా దగ్గరకు తీసుకోడానికి... ముద్దుగా ఆడించటానికి సమయమే దొరకడం లేదు!

జీవితం యాంత్రికమైపోయింది!

మనసు పులకించే అనుభూతులు కాని.. హాయిగా నవ్వుకునే మధుర క్షణాలు కాని లేకుండాపోయాయి!

ఎప్పుడూ పని... పని...

ఉద్యోగమే ధ్యేయమై పోయింది.

పదేళ్ళు గడిచిపోయాయి.

జీవితనౌకలోకి మరొక ప్రయాణీకుడు ఎక్కాడు.

ఇప్పుడు మాలతికి ఒక కూతురు. ఒక కొడుకు. పరీక్షలు వ్రాసి ప్రమోషన్లు సంపాదించింది. ఇటీవలే ఆఫీసరుగా ప్రమోట్ అయింది.

ఇన్నాళ్ళూ భార్య సంపాదనని తన సుఖాలకు సరదాలకు ఖర్చుచేసిన రాజారావు భార్య ఆఫీసరవగానే అతనిలో ఇన్ఫిరియారిటీ కాంప్లెక్సు చోటు చేసుకుంది.

తన కళ్ళ ముందే భార్య ఇంతటి ఉన్నత స్థానాన్ని పొందడం సహించలేకపోయాడు. ఆమెకు సంఘం ఇచ్చే గౌరవ మర్యాదల్ని భరించలేకపోయాడు.

'ఆఫీసరుగారి మొగుడు' అనే బిరుదు అతని మనస్సుని భగభగ మండించసాగింది.

చాలా రోజులు ఆలోచించి ఈ నిర్ణయానికొచ్చాడు!

* * *

"ఉద్యోగానికి రిజైనిస్తున్నావా? లేదా?

మళ్ళీ ఉదయం లేస్తూనే మొదలెట్టాడు రాజారావు.

మాలతి మాట్లాడలేదు.

ఆమె మౌనం అతనికి కారం రాచినట్లుగా ఉంది!

ఏమిటి దీని పొగరు... ఆఫీసరని అహంకారమేమో... ఎంతయినా తన భార్య! తను గీచిన గీటు దాటడానికి వీల్లేదు. ఏదయినా మాట జారిందో భర్తగా తన అధికారాన్ని చూపుతాడు...

"ఏమిటే... వాడికి సమాధానం చెప్పవే! ఆడదానికి అంత అహంకారం పనికిరాదు..

.అయినా వాడు ఉద్యోగం మానమంటోంటే హాయిగా ఇంట్లో కూర్చోక ఎందుకే పట్టుదల..." అత్తగారు అందుకుని సాధించడం మొదలెట్టింది!

మాలతి విరక్తిగా నవ్వుకుంది.

హాయి....

ఒకప్పుడు ఉద్యోగం చెయ్యమంటే బలవంతంగా చేయించాడు..

ఉద్యోగంలో చేరడంవలన..

తను ఎన్నో కోల్పోయింది.

ఆ పనిలో... అలసటలో..

పిల్లల్ని పలకరించడానికి కూడా తీరికయ్యేదికాదు. మధ్యాహ్నం ఆఫీసులోని తీరిక వేళల్లో పిల్లల్ని తలుచుకుని ఎంత కుమిలిపోయావో వీళ్ళకు తెలుసా.

భర్త సినిమాలకు—షికార్లకు తన డబ్బుని జల్సాగా వాడుతోంటే—పిల్లలకు కనీసం బొమ్మలు కూడా కొనిపెట్టలేని తన అసమర్థతకు ఎంత ఏడ్చిందో...

"అమ్మా! పక్కవాళ్ల పాప చూడు. వాళ్ళ అమ్మ పాపనెత్తుకుని చక్కగా అన్నం తినిపిస్తోంది...

"అమ్మా నాతో రైలు ఆట ఆడవా!

"అమ్మా మాకు రాజు కథలు చెప్పవూ'

ఇలా పిల్లలు అడిగే చిన్న కోరికలు కూడా తీర్చలేకపోయినపుడు వాళ్ళు చూసిన చూపు తనకింకా గుర్తుంది.

ఆ జారిపోయిన మధుర క్షణాల్ని వీళ్ళు తెచ్చివ్వ గలరా? తను కోల్పోయిన ఆ మమతానురాగాల్ని తిరిగివ్వ గలడా?

ఎంత జీవితం గడిచిపోయింది!

వృధాగా... నిస్సారంగా.

కనీసం ఉద్యోగంలోనైనా ఉన్నత స్థానాన్ని పొందానని సంతోషిస్తోంటే ఇప్పుడు తన స్వార్థం కొద్ది ఉద్యోగం మానమంటున్నాడు.

ఒకప్పుడు తన జీతం పెరుగుతుందని, హాయిగా దాన్ని ఖర్చుపెట్టుకోవచ్చని ఆఫీసు పెద్దలు వ్రాయమని పీడించుకుతిన్న ఈ

## ప్రత్యక్షదైవం!



రోహిణితో హుషారుగా చెప్పింది మోహిని "పతి అంటే ప్రత్యక్ష దైవమే".

"ఎలా చెప్పగలవే?"

"నేను, నా బాయ్‌ఫ్రెండ్ బెడ్‌రూంలో ఉన్నప్పుడు ప్రత్యక్షమయ్యాడే నా మొగుడు!"

"ఆ..!"

—గీత. (గుంటూరు)

ప్రబుద్ధుడు ఇప్పుడు తను ఆఫీసరవగానే... ఆ హోదాని భరించలేకపోతున్నాడు. తన క్రింద క్లర్కుగా ఉద్యోగం చేయడం సహించలేకపోతున్నాడు.

భర్తగా రిజైన్ చెయ్యమని శాసిస్తున్నాడు.

ఇప్పుడు కూడా తన ఇష్టంతోగాని—తన అభిప్రాయంతో కాని ఆయనకు పనిలేదు.

మగవాడనే అహంభావంతో ప్రవర్తిస్తున్నాడు.

ఆడదాని జీవితం ఎంత హేయమైనది?

ఎంత చదివినా ఎంత పెద్దపదవిలో ఉన్నా ఆమె అస్వతంత్రురాలే...

మాలతి కళ్ళ నుండి వెచ్చటి నీళ్ళు చెక్కిళ్ళపై జారాయి!.

* * *

బాబూ! పాపా! రేపట్నించీ నేనిక ఆఫీసుకు వెళ్ళటంలేదమ్మా! ఇంట్లోనే ఉంటున్నాను.

మర్నాడు ఉదయం పిల్లలతో నవ్వుతూ చెప్పింది మాలతి! ఆమె ఆశించినట్లు వాళ్ళ ముఖంలో ఆనందం కనబడలేదు. సీరియస్ గా స్కూలుకు తయారవుతున్నారు.

"పాపా నేను చెప్పింది విన్నావా" అంది మళ్ళీ.

"మానేస్తే మానెయ్! మాకిన్ని సార్లు చెప్పడం దేనికి" అంది పాప

"మీకానందంగా లేదూ"

"ఆనందమా! ఎందుకు?" బాబు అడిగాడు.

మాలతి తడబడింది అసలా ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు. లేని నవ్వు తెచ్చుకుని—

"నేనింట్లో ఉంటే... మీ పనులన్నీ చేస్తాను... మీకేం కావాలన్నా నేనే ఇస్తాను... మీతో..."

మాలతి మాట పూర్తికాకుండానే పాప అందుకుంది.

మాకేం చెయ్యాలమ్మా? మా పనులు మేం చేసుకోగలం "నాకు టైమైంది... నేను వెడుతున్నా..." అంటూ వెళ్ళిపోయింది.

కొడుకు రవి కూడా అక్కవెంటే వెళ్ళాడు.

కూతురు అన్నమాట మాలతి గుండెల్లో చాకులా దిగింది.

అవును... ఇప్పుడు వాళ్ళకి తనలోపనేం ఉంది. ఆడుకునే వయస్సు కాదు. పెద్దవాళ్ళయ్యారు. పాప అన్నట్లు వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోగలరు? హైస్కూలు చదువుకొచ్చారు! ఇక ఏ విషయంలోనూ తన అవసరం లేదేమో?

చిన్నప్పుడు.

"అమ్మా! ఇవ్వాళ ఆఫీసుకు వెళ్ళొద్దమ్మా" అంటూ ఏడుస్తున్న పిల్లల్ని పట్టించుకోకుండా ఆఫీసుకెళ్ళిపోయేది!

"అమ్మా! సాయంత్రం త్వరగా రామ్మా! సినిమాకు వెడదాం"అని అడిగితే అదేం ఖర్మమో ఆ రోజే బాగా ఆలస్యమయ్యేది. ఆఫీసు పని వత్తిడిలో తల్లిగా తన కనీస ధర్మాలెన్నిటినో నిర్వర్తించలేక పోయింది.

తర్వాత్తర్వాత వాళ్ళేమీ తనని అడిగేవారు కాదు.

వాళ్ళన్నట్లు ఇప్పుడు వాళ్ళకు తనతో

పనేం ఉంది?

మంచం మీద పడుకుని దిండులో తల దూర్చింది మాలతి!

* * *

మాలతి ఉద్యోగానికి రిజైనివ్వలేదు.


కాకినాడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది!

ఆమె కాకినాడ వెడుతోంటే పనిపిల్ల మాత్రం కొద్దిగా బాధపడింది!

"అమ్మగారూ! మీరు నెలకో పాత చీర ఇచ్చేవారు! మీరెళ్ళిపోతే నాకెవరిస్తారండి..."

ఆ మాటలు విని విరక్తిగా నవ్వుకుంది మాలతి!

*



# మిలియనీర్

ప్రాచీనకాలంనుండి మెక్సికో దేశవాసులకు ప్రకృతి సిద్ధంగా లభించే జిగురునుండి తయారుచేసిన పదార్థాన్ని నమిలే అలవాటుంది ఈ బంకను యకాటాన్స్ 'శాపో డిల్లా' అనే చెట్లనుండి తీసి తయారుచేస్తారు. మెక్సికో దేశస్థులు మానసికంగా ఆందోళనలకు గురైనప్పుడు దీన్ని నములుతూ వుండేవారు. 1836వ సంవత్సరంలో జరిగిన యుద్ధంనుండి పారిపోయిన మెక్సికో దేశ మిలటరీ జనరల్ శాంతో అన్నా, అమెరికా దేశంలో కొన్నాళ్ళు తలదాచుకున్నాడు. అప్పుడు తనతోపాటు కొంత 'చూయింగ్ గమ్'నికూడా తీసుకుపోయాడు. యుద్ధ భీతి తగ్గిన కొన్నాళ్ళకి మెక్సికో నగరానికి తిరిగిపోతూ తనతో తెచ్చిన చూయింగ్ గమ్‌ని అక్కడే వదిలి వెళ్ళిపోయాడు. అప్పుడు అమెరికన్లకిది పరిచయం అయింది. 1871 సంవత్సరంలో థామస్ ఆడమ్స్ అనే ఆయన ఈ గమ్‌ను ఉపయోగించి రబ్బర్ తయారనుకుని విఫలం అయ్యాడు. కనీసం కట్టుడు పళ్ళయినా అతికించవచ్చుననుకొని అదీ చెయ్యలేకపొయ్యాడు. చివరికి ఆ బంకని ఉడికించి ఓ పుల్లకి చుట్టి అమ్మకం మొదలు పెట్టాడు. అలా మొదలైన అమెరికా అమ్మకాలు బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విలియం రిగ్లీ జూనియర్ అనబడే చూయింగ్ గమ్ కింగ్ మిలియన్స్ ఆఫ్ డాలర్లు సంపాదించి అనేక దీవుల్ని కొన్నాడు.

—ప్రసాద్